కోర్కెలు తీర్చే దేవుడు.. పాండురంగడు

- సాలగ్రామశిలతో స్వయంభూగా ఆవిర్భవించిన స్వామి విగ్రహం
- ఆలయానికి 500 ఏళ్ల చరిత్ర
- మంత్రాలయం రాఘవేంద్రస్వామితో పాటు పలువురు మహనీయుల దీక్షలు
- ఏటేటా పెరుగుతున్న స్వామి విగ్రహం, గర్భగుహ కొండ
- నేడు తొలి ఏకాదశి ఉత్సవాలు


ప్రత్యేక అలంకరణలో పూజలందుకున్న రుక్మిణి నల్లకొండ పాండురంగడు


ఆలయం, నల్లకొండలు, భానుతీర్థం (వృత్తంలో)

ఆదోని అర్బన్: పట్టణశివారులోని ఇస్వీ రోడ్డులో వెలిసిన శ్రీ స్వయంభూ నల్లకొండ పాండురంగ స్వామి కొలిచిన వారికి కోర్కెలు తీర్చే దేవుడిగా విరాజిల్లుతున్నాడు. సాలగ్రామశిలతో వెలసిన స్వామివారికి ఆదివారం తొలి ఏకాదశి సందర్భంగా వైభవంగా పూజలు జరగనున్నాయి. ఆలయంలో ఆలయ నిర్వాహకులు అశ్వర్థనారాయణ ఆధ్వర్యంలో ఆలయ వంశపారంపర్య అర్చకులు సముద్రాల పవన్, అశ్వంత్‌లు వేకువజామున 4 గంటలకు పాండురంగస్వామి, రుక్మిణిమాతలకు పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం, తులసీహారం, వెండి అలంకరణ, నైవైద్యం, మహామంగళహారతితో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. మధ్యాహ్న పల్లకిసేవ, సాయంత్రం రథోత్సవం ఉంటుంది.

ఆలయానికి 500 ఏళ్ల చరిత్ర

మహామహిమాన్విత శ్రీ నల్లకొండ పాండురంగస్వామివారి ఆలయం అతి పురాతనమైనది. ఈ దేవాలయానికి 500 సంవత్సరాల చరిత్ర ఉందని శ్రీ పాండురంగవిజయం అనే మరాఠీ గ్రంథములో మహావిష్ణువు భక్తుడైన శ్రీ భానుదాసులవారి జీవిత చరిత్రలో పేర్కొన్నారని ఆలయ నిర్వాహకులు అశ్వర్థనారాయణ, అర్చకులు పవన్, అశ్వంత్ తెలిపారు. మహాభక్తుడైన భానుదాసులవారు శ్రీ మహావిష్ణువును ప్రసన్నం చేసుకుని తన కమండలమున జల సూక్ష్మరూపంలో ఉండాల్సిందిగా ప్రార్థించి వరం పొందుతాడు. ఒకరోజు భానుదాసులవారు హంపీ నుంచి మహారాష్ట్రలోని పండరీపురం వెళ్తూ మార్గమధ్యలో ఆదోనిలో పట్టణశివారులోని ఇస్వీ రోడ్డులో ఒక రాత్రి నిద్రిస్తారు. నిద్రించేవేళలో జలసూక్ష్మ రూపంలో మహావిష్ణువు ఉన్న కమండలమును ఆదిశేషుని(పాము)పై ఉంచుతారు. ఆ కమండలము పెట్టినచోటే శ్రీ మహావిష్ణువు పాండురంగ విఠలుడి దివ్యమంగళ విగ్రహం స్వయంభూగా నిలబడిందని ప్రతీతి. ఆదిశేషునికి గుర్తుగా గర్భగుడిలోని శ్రీస్వామివారి మూలవిరాట్‌నకు వెనక ఒక పాముపుట్ట ఉంది. విగ్రహం వెనుకనే ఒక పాము ఉండడం ఆలయ విశేషం. ఆలయంలో స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు నాగేంద్రుడు కూడా దర్శనమిస్తాడు.

మూడు రూపాల్లో దర్శనం

నల్లకొండ పాండురంగస్వామి ఆలయంలో పాండురంగస్వామి మూడు రూపాల్లో భక్తులకు దర్శనమిస్తాడని సాహిత్య పండితులు శ్రీ విజయదాసులవారి అభంగంలో ప్రస్తావించారు. ఉదయం బాలుడిగానూ, మధ్యాహ్నం యువకుడుగానూ, సాయంత్రం వృద్ధుడుగా దర్శనమిస్తాడు.

ఆలయం వద్ద భానుతీర్థం

మహావిష్ణువైన శ్రీ భానుదాసులవారు పాండురంగ స్వామి కోసం భానుతీర్థమనే బావిని తన మంత్రోచ్చరణలతో నెలకొల్పుతారు. ప్రతిరోజూ స్వామివారికి స్నానం కోసం భానుదాసులవారు ఈ బావిని ఆలయం ముందు ప్రత్యేకంగా భానుతీర్థంగా పెట్టారు.

కమండలం నీడతోనే మారిన నల్లకొండ

భానుదాసులవారు నల్లకొండ పాండురంగస్వామి ఆలయం వద్ద నిద్రించిన తర్వాత భానుతీర్థంలో స్నానమాచరించి స్వయంభూగా వెలిసిన పాండురంగడుకి పూజలు నిర్వహించి, పండరీపురానికి వెళ్తారు. ఆలయం నుంచి కమండలం తీసుకొని వెళ్తుండగా ఆ కమండలం నీడ కొండపైన, కొండ రాళ్లపైన పడడంతో ఆ కొండ, రాళ్లు నల్లగా మారిందని శ్రీభానుదాసులవారి చరిత్రలో ఉందని ఆలయ నిర్వాహకులు, అర్చకులు తెలిపారు.

రాఘవేంద్రస్వామివారి చతుర్మాసవ్రతం

మంత్రాలయం గురుసార్వభౌములు శ్రీ రాఘవేంద్రస్వామివారు నల్లకొండ పాండురంగస్వామి సన్నిధిలో చాతుర్మాసవ్రతం చేశారు. అంతేగాకుండా శ్రీ విజయదాసులు, శ్రీపంగనామ తిమ్మనాదులు ఈ స్థలంలో తపమాచరించి శ్రీ విఠలునితో సంభాషించారు. భక్తితో శ్రీ వేణుగోపాల మధురవిఠల కీర్తనలు రచించి స్వామివారికి అంకితమిచ్చారు. విజయదాసులవారు 'కదలిబారయ్య శ్రీహరి' అనే పాడిన పాటకు శ్రీ స్వామివారి రథం తనంతట తాను కదిలివచ్చిందని చెబుతారు. నల్లకొండ పాండురంగస్వామి ఆలయంలోనే 1747 ప్రభావనామ సంవత్సరం మొట్టమొదటిసారిగా పంగనామ తిమ్మనదాసులకు విజయదాసుచే మంత్రదీక్ష ఇచ్చారు.

గోపాలదాసుడికి ఇక్కడి నుంచే పండరీపుర దర్శనం

భూత భవిష్య వర్తమాన కాలాన్ని తెలుపుగల ద్రష్ట, మహా విష్ణుభక్తుడైన గోపాలదాసు ఇక్కడి మంగరాయ దేవాలయంలో తపమాచరించుచూ ప్రతి ఏకాదశి రోజున నల్లకొండలో పాండురంగస్వామి వారిని దర్శించుకునేవారు. గోపాలదాసువారు మహారాష్ట్రంలోని పండరీపురం తప్పా భారతదేశంలోని అన్ని తీర్థ స్థలాలను చుట్టి వేశారు. అయితే గోపాలదాసుల వారికి పండరీపురం దర్శించలేదనే ఆవేదన ఉండేది. ఒకరోజు స్వామివారి పూజ కోసం నల్లకొండలో తులసీ ఆకులను తెంచుతుండగా పాండురంగడు నల్లని గుర్రం రూపంలో వచ్చి గోపాలదాసును మూల విగ్రహంలో విలీనం చేసి వారికి పండరీపుర దర్శనం చేయించి మూడు రోజుల తర్వాత బయటకు తీసుకొచ్చారు. ఈ విషయాన్ని ఆయన 'నీల కుదిరే ఏరి బందా' అని తన సాహిత్యంలో పేర్కొన్నారు. మరెంతో మంది సాహిత్యదాసులు, యోగులు తపస్సులు చేసిన స్థల ప్రభావం ఈ నల్లకొండ పాండురంగస్వామి.

పెరుగుతున్న ఆలయ విగ్రహం

పట్టణశివారులోని ఇస్వీ గ్రామ రోడ్డులో వెలిసిన శ్రీ నల్లకొండ పాండురంగస్వామి ఆలయం గత 30 సంవత్సరాల నుంచి పెరుగుతూనే ఉంది. అంతేగాకుండా స్వామివారి విగ్రహంతో పాటు గర్భగుడి కూడా పెరుగుతోంది. గతంలో భక్తులు నడుము వరకు వంగి దర్శించేవారు. ప్రస్తుతం నిటారుగానే దర్శనం చేసుకుంటున్నారు.

తొలిఏకాదశి ప్రత్యేక పూజలు



అతి పురాతనమైన ఆలయంలో శ్రీ నల్లకొండ పాండురంగస్వామి స్వయంభూగా సాలగ్రామశిలతో వెలిశాడు. 41 రోజులు దీక్షతో తిరిగినా 11 ఏకాదశిలు, 5 పౌర్ణమిలు దర్శించుకున్న వారికి కోర్కెలు తీరుతాయి. ఆదివారం తొలి ఏకాదశి సందర్భంగా పాండురంగ స్వామిని ప్రత్యేకంగా కొలుస్తారు. ఆనాటి భక్త తుకారాం తొలి ఏకాదశినాడే పండరీపురానికి పాదయాత్ర చేస్తూ స్వామివారిని దర్శించుకున్నాడు, అప్పటి నుంచి స్వామి తొలి ఏకాదశి ప్రత్యేక పూజలు చేపడుతున్నారు.

– పవన్‌కుమార్,
ఆలయ వంశపారంపర్య అర్చకుడు

హైవేని పూర్తిస్థాయిలో నిర్మించాలి

ఆదోని అర్బన్: కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణ, మహారాష్ట్రాలను కలిపే అతి ముఖ్యమైన 167 జాతీయ రహదారిని అసంపూర్తిగా వదిలివేయడం వల్ల ప్రజలకు అనేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, జాతీయ రహదారిని పూర్తి స్థాయిలో నిర్మించాలని ఆదోని మాజీ ఎమ్మెల్యే బి.చంద్రశేఖర్‌రెడ్డి సంబంధిత అధికారులను కోరారు. ఈ మేరకు శనివారం ఆయన మాట్లాడుతూ 167 జాతీయ రహదారిని కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి నుంచి చింతకుంట మీదుగా ఆదోని, ఆలూరు, మంత్రాలయంకు వెళ్లే రహదారిలో చింతకుంట సమీపంలో మూడు వంతెనలు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. మూడేళ్ల నుంచి నిర్మాణం పూర్తి చేయకుండా వదిలివేయడంతో ఈ రహదారిలో భారీ వాహనాలు, బస్సులు, ఇతర వాహనాలు వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నాయన్నారు. ఈ రోడ్డు మంత్రాలయంకు వెళ్లే భక్తులకు అతి ముఖ్యమైనదని, పనులు పూర్తి చేయాలని కోరారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

కోసిగి: మండల పరిధిలోని జంపాపురం గ్రామానికి చెందిన కపటి చెన్నబసవ(25) అనే వ్యక్తి శుక్రవారం రాత్రి కోసిగి సమీపంలోని ఆదోని రోడ్డులో బైక్‌పై వెళ్లుతూ ట్రాక్టర్ ఢీకొని మృతి చెందిన విషయం విధితమే. శనివారం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ఆ కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి పరామర్శించారు. కుటుంబానికి రాంపురం రెడ్డి సోదరులు అండగా ఉంటామని భరోసా కల్పించారు.

నేడు ఉచిత రేబిస్ నివారణ టీకాలు

ఎమ్మిగనూరురూరల్: స్థానిక పశువైద్యశాలలో ఆదివారం ఉచితంగా రేబిస్ నివారణ టీకాలు వేస్తున్నట్లు పశువైద్యాధికారి డాక్టర్ సుబ్రమణ్యాచారి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రపంచ జూనోసిక్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉచిత టీకాలు వేస్తున్నామన్నారు.

రెగ్యులరైజ్ చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: విద్యాశాఖలో పని చేస్తున్న సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులను ప్రభుత్వం రెగ్యులర్ చేయాలని ఎస్ఎస్ఏ కార్మిక సంఘ జిల్లా కమిటీ సభ్యుడు ఇ.రంగన్న గౌడ్, సీఐటీయూ తాలూకా కార్యదర్శి రాముడు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు నాగరాజరావు, విజయ్‌శ్యామ్, జయన్న, జయరాముడు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉన్నతంగా చదువుకుంటే ఉజ్వల భవిష్యత్తు


ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులతో హెచ్‌ఎం ఉమారాజేశ్వరి

పెద్దకడబూరు: ఉన్నతంగా చదువుతున్న విద్యార్థులందరికీ ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ప్రధానోపాధ్యాయురాలు ఉమారాజేశ్వరి సూచించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్ఎంఎంఎస్ పరీక్షలలో ఉత్తీర్ణత పొందిన కె.మేఘన, కె.భాగ్యశ్రీ, ఎస్.వీరేంద్ర, వి.మనోజ్, కె.కిరణ్, ఎం.ఇమ్రాన్‌ల అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్యాంకుల శుభ్రం


ట్యాంక్‌ను శుభ్రం చేయిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కోసిగి: మండల పరిధిలోని మూగలదొడ్డి గ్రామంలో పారిశుద్ధ్యం, తాగునీటి ట్యాంక్‌ల శుభ్రత పనులు గ్రామ సర్పంచ్ శివలింగమ్మ, వైఎస్సార్ సీపీ నాయకుడు సోమేష్‌లు శనివారం దగ్గరుండి చేయించారు. ఈనెల 7వ తేదిన గ్రామంలో మొహర్రం పండుగను పురస్కరించుకుని గ్రామంలో తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంక్, మినీ ట్యాంక్‌లు శుభ్రం చేయించారు. అలాగే గ్రామంలో ప్రతి కాలనీలో వీధి లైట్లు పరిశీలించి కొత్తవి ఏర్పాటు చేయించారు. గ్రామంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అభివృద్ధి పనులు చేయించారు. దీంతో గ్రామ ప్రజలు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పోషకాహార కిట్ల పంపిణీ


పోషకాహార కిట్లను పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ నాగరత్నమ్మ, వైద్య సిబ్బంది

ఆదోని టౌన్: పట్టణంలోని షరీఫ్‌బజార్‌లో శనివారం మున్సిపల్ కౌన్సిలర్ నాగరత్నమ్మ దంపతుల సహకారంతో క్షయవ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. పేద క్షయవ్యాధిగ్రస్తులను దత్తత తీసుకునేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనిల్‌సాగర్, సూపర్‌వైజర్లు బాబురాజు, జ్ఞానేశ్వరి, సుబ్బమ్మబాయి, హెల్త్ అసిస్టెంట్లు చంద్రశేఖర్, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన


మాధవరం పోలింగ్ కేంద్రం-52ను పరిశీలించిన తహసీల్దార్ రమాదేవి

మంత్రాలయం రూరల్: మండల పరిధిలోని మాధవరం, రచ్చుమర్రి గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ రమాదేవి శనివారం పరిశీలించారు. మాధవరం గ్రామంలో పోలింగ్ బూత్-52ను తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల స్థితిగతులను పరిశీలించామన్నారు. పాతబడిన పోలింగ్ కేంద్రాలతో పాటు నూతన కేంద్రాలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఆంజనేయస్వామికి పూజలు

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళం, మండల పరిధిలోని అగసలదిన్నె గ్రామంలో వెలసిన ఆంజినేయస్వామి, సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుడుములదొడ్డి ఆంజనేయస్వామి దేవాలయం, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజినేయస్వామి దేవాలయాల్లో శనివారం భక్తులు ప్రత్యేక పూజలను నిర్వహించారు.

రోడ్డుపై వరి నాట్లు వేసి నిరసన


ఎమ్మిగనూరు-కోసిగి రోడ్డుపై నిలిచిన వర్షపు నీటిలో వరినాట్లు వేస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: గత రెండు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఎమ్మిగనూరు నుంచి కోసిగికి వెళ్లే రహదారి శిథిలమైంది. రహదారి గోతుల్లో నిలిచిన వర్షపు నీటిలో శనివారం సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు వాహనదారులు, కొత్తగొల్లల దొడ్డి గ్రామస్తులతో కలిసి వరినాట్లు వేసి నిరసన తెలిపారు. ఆ పార్టీ జిల్లా నాయకులు సత్యన్న మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి రోడ్డును పునర్నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బాలరాజు, బాబు, ఏఐకెఎంఎస్ నాయకులు అంజినేయులు, ప్రసాద్, నరసన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి


ఆదోని విద్యుత్‌శాఖ కార్యాలయ అధికారికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ఆదోని రూరల్: విద్యుత్ చార్జీల పెంపు, స్మార్ట్ మీటర్ల బిగింపును నిరసిస్తూ శనివారం సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహించారు. స్థానిక విద్యుత్‌శాఖ డీఈ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. డీఈ కార్యాలయ అధికారికి వినతి పత్రం అందించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.అజయ్‌బాబు, పట్టణ, మండల కార్యదర్శులు టి.వీరేష్, కల్లుబావిరాజు, జిల్లా సమితి సభ్యులు సుదర్శన్, చేతివృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి కారన్న తదితరులు మాట్లాడుతూ ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలను పెంచబోమని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక పెంచడం తగదన్నారు. రైతులను నమ్మించి ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే నాలుగుసార్లు విద్యుత్, ట్రూ అప్ చార్జీలు పెంచి రాష్ట్ర ప్రజలను మోసం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించి, స్మార్ట్‌మీటర్లను తొలగించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి లక్ష్మీనారాయణ, రమేష్, శివరాముడు, రైతుసంఘం మండల కార్యదర్శి బసాపురం గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నందవరం: మండల కేంద్రంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పంపన్నగౌడ్, సోమేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో విద్యుత్, ట్రూ అప్ చార్జీలు తగ్గించాలని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఆ పార్టీ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో రమేష్, ఉరుకుంద గౌడ్, తిప్పన్న, రామలింగడు తదితరులు పాల్గొన్నారు.

మంత్రాలయం రూరల్ : మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయం ఆవరణలో సీపీఐ ఆధ్వర్యంలో ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్ యాదవ్, నాయకులు ధర్నా చేపట్టారు. అనంతరం సబ్ ఇంజనీర్ వేణుగోపాల్‌కి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి లక్ష్మన్న నాయక్, నాయకులు గాబ్రెల్, ఈరన్న, పెద్ద మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

కోసిగి: వ్యవసాయ బోర్లు, బావులకు విద్యుత్ మీటర్లు అమర్చడాన్ని ఉపసంహరించుకోవాలని మండల సీపీఐ కార్యదర్శి గోపాల్, సహాయ కార్యదర్శి సుదాకర్‌లు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపి, ట్రాన్స్‌కో ఏఈ వీరేష్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఓంకార్ స్వామి, చాంద్‌బాషా, మూకప్ప, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: కూటమి ప్రభుత్వం ప్రజలపై మోపిన విద్యుత్ సర్దుబాటు చార్జీలను సత్వరం తగ్గించాలని డిమాండ్ చేస్తూ స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, మండల కార్యదర్శి రాజీవ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ధర్నా చేపట్టి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఏడీఏకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సమీవుల్లా, శ్రీరాము, బజారి, దాదావలి, జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దకడబూరు : వ్యవసాయ విద్యుత్ మోటార్లకు స్మార్ట్ మీటర్లు తొలగించాలని సీపీఐ మండల కార్యదర్శి వీరేష్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మబ్బు ఆంజనేయ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. వినతి పత్రాన్ని విద్యుత్ ఏఈ సుబ్బారెడ్డికి సమర్పించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మండల అధ్యక్షుడు జాఫర్‌పటేల్, నాయకులు కుమ్మరి చంద్ర, షేక్షావలి, డోలు హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి


గుడేకల్ గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎల్‌పీవో తిమ్మక్క

ఎమ్మిగనూరురూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డివిజన్ పంచాయతీ అధికారిణి తిమ్మక్క సూచించారు. శనివారం మండల పరిధిలోని గుడేకల్ గ్రామంలోని చెత్త సేకరణ షెడ్లను, చెత్త సేకరణను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ మన చుట్టూ ఉండే పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చన్నారు. చెత్త సేకరణ సక్రమంగా జరగాలని, తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి వర్మికంపోస్ట్ యార్డ్‌కు తరలించాలని తెలిపారు. ఈవోఆర్డీ విజయలక్ష్మీ, తదితరులు ఉన్నారు.

ఉబికి వస్తున్న గంగమ్మ


బోరు నుంచి వస్తున్న నీరు

పెద్దకడబూరు : మండల పరిధిలోని బాపులదొడ్డి గ్రామానికి చెందిన వందగల్లు నరసింహులు అనే రైతు పొలంలోని బోరు నుంచి గంగాజలం ఉబికి వస్తోంది. వందగల్లు నరసింహులు తనకున్న 4.5ఎకరాలలో గత 15సంవత్సరాల క్రితం బోరు వేయించుకున్నాడు. అప్పుడు చాలీచాలనీ నీటితో పొలాన్ని తడుపుకునేవాడు. అయితే కొన్ని సంవత్సరాల తరువాత పక్కనే పులికనుమ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. దీంతో చుట్టుపక్క గ్రామాల భూగర్భజలం రెట్టింపు అయ్యింది. అందులో భాగంగానే ఈ బోరుకింద కూడా భూగర్భ జలం పెరిగింది. దానికి తోడు వర్షాలతో భూగర్భ జలం పెరిగడంతో గత నాలుగైదు సంవత్సరాలుగా బోరునుంచి బయటకు పొంగి పొర్లుతోంది. వర్షాలు తగ్గుముఖం పట్టే వరకూ బోరునుంచి నీరు వస్తూనే ఉంటుంది, వర్షాలు తగ్గితే నీరు కూడా తగ్గుతుంది.

ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు


యూరియా కోసం డీసీఎంఎస్ వద్ద బారులు తీరిన రైతులు

ఎమ్మిగనూరురూరల్: వ్యాపారులు ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏడీఏ మహమ్మద్‌ఖాద్రి, ఏవో శివశంకర్ హెచ్చరించారు. శనివారం స్థానిక డీసీఎంఎస్ వద్ద యూరియా కోసం పెద్ద సంఖ్యలో రైతులు తరలిరావడంతో కొద్దిసేపు గందరగోళం నెలకొంది. పట్టణ పోలీసులు అక్కడికి చేరుకొని రైతులను క్యూ లైన్‌లో నిల్చోబెట్టారు. ఏడీఏ మాట్లాడుతూ ఎరువుల కొరత లేదని, స్టాక్ పుష్కలంగా ఉందని తెలిపారు. మంత్రాలయం, గోనెగండ్ల, నందవరం మండలాల్లో సొసైటీల్లో ఎరువులు దొరుకుతున్నా రైతులు ఇక్కడికి వస్తున్నారని, ఏ మండలం రైతులు అక్కడే ఎరువులు తీసుకోవాలని కోరారు. వీరబ్రహ్మేంద్ర స్వామి ట్రేడర్స్ లైసెన్సులో జీరో ఫామ్స్ ఇంక్లూడ్ చేయనందున 70 బస్తాల యూరియా అమ్మకాలను నిలుపుదల చేసినట్లు తెలిపారు.

ఘనంగా పెద్ద సరిగెత్తు



గోనెగండ్ల : మండల కేంద్రం గోనెగండ్లతో పాటు పలు గ్రామాల్లో మొహర్రం వేడుకలల్లో భాగంగా శనివారం పెద్ద సరిగెత్తు ఘనంగా నిర్వహించారు. భక్తులు మేళతాళాలతో పీర్ల చావిడి దగ్గరకు ఊరేగింపుగా వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అలాయి గుంతలో నిప్పులపై నడిచి భక్తిని చాటుకున్నారు. పీర్ల దేవుళ్లను పూలదండలతో, వెండి ఆభరణాలతో అలంకరించారు. ఆదివారం గోనెగండ్లలో మొహర్రం వేడుకలు నిర్వహిస్తున్నట్లు ముజావర్లు తెలిపారు. మొహర్రం వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సీఐ విజయభాస్కర్ సూచించారు.

లోక్‌అదాలత్‌లో కేసుల పరిష్కారం


మాట్లాడుతున్న జడ్జి పి.జె.సుధ


కేసులు విచారిస్తున్న ఎమ్మిగనూరు జడ్జి శ్రీవల్లి


ఆదోని రూరల్: పట్టణంలోని జిల్లా రెండో అదనపు జడ్జి కార్యాలయంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 860 కేసులు పరిష్కారమైనట్లు జిల్లా రెండో అదనపు జడ్జి పి.జె.సుధ తెలిపారు. ఇందులో సీసీ 34 కేసులు, మనీ మ్యాటర్స్ 6, డీవీసీ 2, ఎంసీ 4, సమరీ ట్రెల్స్ 393, అడ్మిషన్ 351 కేసులు, ఓఎస్ మనీ 19, ఒరిజినల్ సూట్ టైటిల్ 16, ఈపీ 19, మోటార్ వాహనాల కేసులు 15, ఇతర కేసులు 1 వరకు పరిష్కారమైనట్లు చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి యజ్ఞనారాయణ, న్యాయవాదులు ఎండీ ఇస్మాయిల్, లోకేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో శనివారం జరిగిన లోక్‌అదాలత్‌లో మొత్తం 654 కేసులను జడ్జి ఏవీఎస్ శ్రీవల్లి పరిష్కరించారు. కార్యక్రమంలో ఏపీపీ శ్రీలత, లోక్ అదాలత్ సభ్యులు విమల, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రషీదుల్లా, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఏపీ హంస తాలూకా కార్యవర్గ ఎన్నిక

ఎమ్మిగనూరుటౌన్: ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్(ఏపీ హంస) తాలూకా అధ్యక్షుడిగా నాగన్నగౌడ్‌ను, కోశాధికారిగా సిరాజున్నిసాబేగంను అసోసియేషన్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం పట్టణంలోని శిల్పా కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బదిలీపై వెళ్తున్న అసోసియేషన్ పూర్వ అధ్యక్షుడు, ఫార్మసిస్ట్ జగదీష్, పూర్వ కోశాధికారి నాగన్నగౌడ్‌ను సభ్యులు ఘనంగా సత్కరించారు. జిల్లా అధ్యక్షుడు రఘుబాబు, కార్యదర్శి సయ్యద్ రఫీ, జిల్లా ఉపాధ్యక్షుడు సందీప్ త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు


మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సత్యవతి

నందవరం : విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌ఓ సత్యవతి హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలన్ని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అలాగే కనకవీడు గ్రామంలో 104 ద్వారా గ్రామాల్లో అందించే వైద్య సేవలను పరిశీలించారు. అయితే ఇద్దరు డాక్టర్లు విధుల్లో లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఇద్దరికీ సంజాయిషీ ఇవ్వాలని నోటీసు ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ.. వైద్యాధికారులు వైద్య సేవలలో అలసత్వం, విధులకు హాజరు కాకపోవడం వంటి చర్యలను ఉపేక్షించమన్నారు. వైద్యాధికారులు, వైద్య సిబ్బంది గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోని రూరల్: కర్ణాటక రాష్ట్రం నుంచి ఆదోనికి అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని కర్నూలు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ సీఐ సుభాషిణి, సిబ్బందితో దాడులు చేసి పట్టుకున్నారు. ఆమె మాట్లాడుతూ.. ఆదోనికి చెందిన జి.మల్లికార్జున, బోయ హరిశ్చంద్రలను అరెస్టు చేసి, వారి వద్ద ఏపీ26ఏఎఫ్ 0379 నంబర్ గల టాటా ఇండికా విస్టా కారు, 14 కేసులు కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కర్ణాటక నుంచి తెచ్చిన అక్రమ మద్యాన్ని నాగిరెడ్డి అనే వ్యక్తి తెప్పించి అమ్ముకుంటున్నట్లు వారు తెలిపారన్నారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించినట్లు చెప్పారు.

మేధావుల ఫోరం జిల్లా కార్యదర్శిగా జానకిరామిరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎమ్మిగనూరు మండలంలోని దైవందిన్నె గ్రామానికి చెందిన సీబీ జానకిరామిరెడ్డిని పార్టీ మేధావుల ఫోరం జిల్లా కార్యదర్శిగా నియమిస్తూ కేంద్రపార్టీ కార్యాలయం శుక్రవారం ప్రకటించింది. అదే విధంగా పార్టీ జిల్లా సాంస్కృతిక విభాగం కార్యదర్శిగా పట్టణంలోని 24వ వార్డు ఇన్‌చార్జ్ బుడగ జంగాల రుద్రాక్షాల బజారి నియమితులయ్యారు.

ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

ఎమ్మిగనూరుటౌన్/కోసిగి: రాష్ట్రంలో విద్యార్థులకు పెండింగ్‌లో వున్న ఫీజురీయింబర్స్‌మెంట్, వసతి దీవెన నిధులను కూటమి ప్రభుత్వం విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న, జిల్లా ఉపాధ్యక్షుడు వీరేష్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్‌లో, కోసిగిలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు పురుషోత్తం, మునిస్వామి, విష్ణు, రవి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.